క్లుప్తంగా

ముగిసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

నందిగామ టౌన్‌:పట్టణంలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. దీనిలో భాగంగా శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, బండారు కేదార్‌నాథ్‌, పులిపాటి శ్రీనివాసరావు, కొప్పు రామారావు, కొంగర దుర్గాప్రసాద్‌ బ్రహ్మోత్సవాల విజయవంతానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వేలం ద్వారా రూ.16.62 లక్షలకు పైగా ఆదాయం

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో శనివారం నిర్వహించిన బహిరంగ వేలం పాటల ద్వారా ఆలయానికి రూ.16,62,800 ఆదాయం వచ్చినట్లు ఈఓ కిషోర్‌కుమార్‌ తెలిపారు. ఆలయ బేడా మండపంలో జరిగిన బహిరంగ వేలం ద్వారా ఏడాది పాటు వివిధ రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు 13 దుకాణాల వేలం పాటల ద్వారా రూ.14,96,800 ఆదాయం రాగా, ఎలక్ట్రికల్‌ స్క్రాప్‌ ద్వారా రూ.రూ.1,05,000, సివిల్‌ స్క్రాప్‌ ద్వారా రూ.61,000 ఆదాయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ జంగాల శ్రీనివాసరావు, ఈఈ రమ, ఏఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి ప్రత్యేక ఆధార్‌ క్యాంపులు

వత్సవాయి: ఈ నెల 5 నుంచి 8 వరకు మండలంలో ప్రత్యేక ఆధార్‌ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్‌.రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 ఏళ్ల లోపు పిల్లల కోసం ఈ క్యాంపును ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆధార్‌కార్డులో ఫొటో మార్పుతో పాటు ఇతర మార్పుచేర్పులు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి కోరారు. 5 న మంగొల్లు-1, మాచినేనిపాలెం గ్రామ సచివాలయాల వద్ద, 6 న మంగొల్లు-2, కాకరవాయి, 7 న భీమవరం -1, కంభంపాడు, 8 న భీమవరం-2, వేమవరం గ్రామ సచివాలయాల వద్ద ఈ క్యాంపులు జరుగుతాయని తెలిపారు.

మజ్జిగ, చెరుకు రసం పంపిణీ



నందిగామ టౌన్‌:దాతల సహకారం మరులేనిదని సత్యదివ్యాంగుల సేవా సమితి సభ్యుడు కోటి సూర్యం తెలిపారు. పట్టణంలోని మెయిన్‌ బజార్‌లో సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద శనివారం దాతల సహకారంతో మజ్జిగ, చెరుకు రసం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరశెట్టి నాగప్రసాద్‌, నీరజ సౌజన్యంతో చెరుకు రసం, సాదం రామకృష్ణ, త్రివేణిల సౌజన్యంతో మజ్జిగ పంపిణీ చేశామన్నారు. దాతల సహకారంతో ఏటా చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ, చల్లని తాగునీటిని అందిస్తున్నామని చెప్పారు. అనంతరం దాతలను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌ అభివృద్ధి అధికారిగా రాజు



వీరులపాడు:మండల పరిషత్‌ అభివృద్ధి అధికారిగా రాజు నియమితులయ్యారు. సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఎంపీడీవో (ఎఫ్‌ఏసీ)గా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఆయా గ్రామాల కార్యదర్శులు సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

గోశాలకు ఎండు గడ్డి వితరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలకు శనివారం మండలంలోని సుబ్బాయిగూడెం గ్రామానికి చెందిన రైతు కూచి శ్రీనివాసరావు తన ట్రాక్టర్‌పై 50 వరి గడ్డి కట్టలు తీసుకువచ్చి వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శ్రీనివాసరావును అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

వేసవి సెలవులు.. వికాసానికి నెలవులు

- గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ
- పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్న వైనం
- శిబిరాలకు ఆసక్తి కనబర్చుతున్న విద్యార్థులు



కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో చెస్‌ ఆడుతున్న విద్యార్థులు

కంచికచర్ల: విద్యార్థులకు గత నెల 24 నుంచి జూన్‌ నెల 11వ తేదీ వరకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. పలువురు విద్యార్థులు వేసవి సెలవుల్లో ఆటపాటలతో గడపుతూ, కొంత సమయాన్ని విజ్ఞాన సముపార్జనకు వినియోగిస్తున్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో గ్రంథాలయాలను విద్యార్థులకు బాగా చేరువ చేశారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో గ్రంథాలయాలను మరింత చేరువ చేసేందుకు గ్రంథాలయ శాఖ ప్రణాళిక రూపొందించింది. మానసిక, శారీరక వికాసంతో పాటు వారిలో ఉన్న సృజనాత్మకతను పెంచుకునేందుకు రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. 45 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు.

నైపుణ్యాలను వెలికితీసేందుకు...

వేసవి సెలవులు వృథా కాకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వివిధ గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను గ్రంథాలయ శాఖ ఏర్పాటు చేసింది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రతిరోజూ ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. కథలు వినడం, గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవటం, పుస్తక సమీక్షలు, కథలు చెప్పటం, స్పోకెన్‌ ఇంగ్లీష్‌, డ్రాయింగ్‌, పెయింటింగ్‌, పేపర్‌ క్రాఫ్ట్‌, డ్యాన్స్‌, పప్పెట్‌ మేకింగ్‌, చెస్‌, క్యారమ్స్‌, క్విజ్‌ తదితర సృజనాత్మక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లోని నైపుణ్యాలను అభివృద్ధి పర్చుతారు. శిక్షణ అనంతరం విద్యార్థులు నేర్చుకున్న అంశాలపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయటంతో పాటు, విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులను సమ్మర్‌ క్యాంపులకు పంపేందుకు ఆసక్తి కనపర్చుతున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలకు పదును పెడుతున్నారు. విద్యార్థులు కూడా తమకు ఇష్టమైన పుస్తకాలు చదవటం, కథలు చదవటం, తిరిగి ఆ కథలను సొంత మాటలతో చెప్పటంతో పాటు ఆటపాటలతో ఆనందించే విధంగా లైబ్రేరియన్లు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు, విద్యావేత్తలను న్యాయ నిర్ణేతలుగా వినియోగించుకుంటున్నారు.

1500 మందికి శిక్షణ

ఉమ్మడి కృష్ణా జిల్లాలో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలను శాఖా గ్రంథాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యాన జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలో 109 లైబ్రేరీలు ఉన్నాయి. వీటితోపాటు గ్రామీణ గ్రంథాలయాలు, పుస్తక అభివృద్ధి కేంద్రాలు(బీడీసీ)లు ఉన్నాయి. ఈ శిబిరాల్లో ప్రతిరోజూ సగటున సుమారు 1,500 మందికి పైగా విద్యార్థులు విజ్ఞాన సముపార్జన చేస్తున్నారు.

శిబిరం ఎంతో ఉపయోగపడుతుంది



వేసవి శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడుతుంది. ఆటపాటలు, కథలు, ఇంగ్లీష్‌, డ్రాయింగ్‌ వంటివి నేర్చుతున్నారు. ఉదయాన్నే గ్రంథాలయానికి వస్తున్నా. అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. చాలా బాగుంది.

జాస్మిని విద్యార్థి, కంచికచర్ల

మంచి స్పందన ఉంది



విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు సమ్మర్‌ క్యాంపులు దోహదపడతాయి. వేసవి శిక్షణ శిబిరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధికంగా పాల్గొంటున్నారు. తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన ఉంది.

నీలం సర్వేశ్వరరావు, డ్రాయింగ్‌ టీచర్‌, కంచికచర్ల

ఇప్పుడిప్పుడే వస్తున్నారు

వేసవి విజ్ఞాన శిబిరాలకు చిన్నారులు రావటం ప్రారంభించారు. క్రమ క్రమంగా హాజరు పెరుగుతుంది. సమ్మర్‌ క్యాంపు వల్ల గ్రంథాలయాల విలువను విద్యార్థులు అర్థం చేసుకుంటున్నారు. పుస్తక పఠనం అలవాటు పెరుగుతోంది. పలు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నాం. ఆ తర్వాత విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తాం.

అల్లూరు రామచంద్రుడు, గ్రంథపాలకుడు కంచికచర్ల

బీమా సదుపాయంపై కూలీలకు అవగాహన



లింగగూడెంలో కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ ఎస్‌.జనార్ధనరావు

పెనుగంచిప్రోలు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డు కలిగిన కూలీలందరికీ ప్రధానమంత్రి సురక్ష యోజన, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి యోజన కింద బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ ఎస్‌.జనార్ధనరావు తెలిపారు. ఈ మేరకు వారు మండలంలోని అనిగండ్లపాడు, కొణకంచి, లింగగూడెం గ్రామాల్లోని కూలీలకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ రూ.20 చెల్లించిన ఉపాధి కూలీ ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.2లక్షల బీమా అందుతుందన్నారు. మరో ప్రీమియం రూ.436 చెల్లించే వారికి అదనంగా రూ.2లక్షల బీమా సదుపాయం ఉంటుందని వివరించారు. పెనుగంచిప్రోలు మండలంలో మొత్తం 11,672 జాబ్‌కార్డులు ఉండగా 20,122 మంది కూలీలు ఉన్నారు. వీరిలో 4,500నుంచి 5 వేల మంది పనులకు హాజరవుతున్నారన్నారు. వీరందరూ ఈ బీమా సదుపాయం కోసం ప్రీమియం చెల్లించాలని సూచించారు. ఎవ్వరికీ నేరుగా నగదు చెల్లించరాదన్నారు. బ్యాంకు ఖాతాల నుంచి మాత్రమే ప్రీమియం మినహాయించుకుంటారనే విషయాన్ని కూలీలంతా గమనించాలని ఏపీఓ కోరారు.

విగ్రహాల ప్లాట్‌ఫాంకు మెట్లు ఏర్పాటు చేయాలి

వినతిపత్రం అందజేసిన బీఎస్పీ నాయకులు



మున్సిపల్‌ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

నందిగామ రూరల్‌: పట్టణంలోని జాతీయ నాయకుల విగ్రహాలు ఎత్తులో ఉండటంతో జయంతి, వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేందుకు ఇబ్బందిగా ఉంటుందని బహుజన్‌ సమాజ్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్‌ పేర్కొన్నారు. విగ్రహాల ప్లాట్‌ఫాం ఎక్కేందుకు మెట్లు, స్టాండు ఏర్పాటు చేయాలని కోరుతూ బహుజన్‌ సమాజ్‌ పార్టీ, బహుజన్‌ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ రమణబాబుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జయంతి, వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించేందుకు రాజకీయ, ప్రజా సంఘాల, తదితర నాయకులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్‌ మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పత్తిపాటి సూర్యం, దున్నా కోటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు పరామర్శ



కార్యకర్తలను పరామర్శిస్తున్న వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు పక్కన గాంధీ

పెనుగంచిప్రోలు:బెయిల్‌పై విడుదలై ఇళ్లకు వచ్చిన వైఎస్సార్‌ సీపీ కార్యకర్తలు ఈటూరి వెంకట్‌, తూము గోపిలను వైఎస్సార్‌ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు శనివారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీతిరుపతమ్మవారి తిరునాళ్ల సందర్భంగా జరిగిన ఘర్షణలో అక్రమ కేసులో అరెస్ట్‌ అయిన 16 మందిలో ఇప్పటికే 14 మంది బెయిల్‌పై వచ్చారని, ప్రస్తుతం ఇద్దరు కూడా బెయిల్‌పై వచ్చారన్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ ఎంపీపీల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మార్కపూడి గాంధీ, రాష్ట్ర బీసీసెల్‌ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, అనిగండ్లపాడు, ముండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు యానాల సురేష్‌, నరాల మధుసూధనరెడ్డి, నాయకులు మండవ శ్రీనివాస్‌గౌడ్‌, గుడిమెట్ల శంకర్‌, జి వెంకటరత్నం, మల్లెబోయిన సైదులు, చేని రాంబాబు, నల్లబోతుల వెంకటేష్‌, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు



పైకప్పు లేచిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న తన్నీరు, నాయకులు

త్రిపురవరం(జగ్గయ్యపేట): మండలంలో శుక్రవారం తెల్లవారుజామున భీకర బాలి బీభత్సానికి గురై పలు గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. గాలి బీభత్సానికి గురై దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాణావత్‌ శంకర్‌, నాగు కుటుంబాలను శనివారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్ల పైకప్పు లేచిపోవటం, మామిడి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. రైతులు నష్టాలతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. విద్యుత్‌ తీగలు ఇళ్లపైనే ఉండటంతో విద్యుత్‌ షార్ట్‌సర్క్యూట్‌ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితులను, రైతులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్‌ బూడిద నరసింహారావు, గ్రామ కన్వీనర్‌ బాణావత్‌ సైదా, నాయకులు నారాయణ, సైదా, వెంకటేశ్వర్లు, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



ఆహ్వానపత్రికను ఎమ్మెల్యే తాతయ్యకు అందజేస్తున్న కేసీపీ సిమెంట్స్‌ అధికారులు

జగ్గయ్యపేట అర్బన్‌: మండలంలోని వేదాద్రి శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 7 వ తేదీ నుంచి జరగనున్నందున ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ (తాతయ్య)కు అందజేశారు. ఈ సందర్భంగా శనివారం దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త వారి ప్రతినిధి అయిన కేసీపీ సిమెంట్స్‌ అసిస్టెంట్‌ మేనేజర్‌ రాంప్రసాద్‌, కార్య నిర్వాహణ అధికారి కానూరు సురేష్‌ ఎమ్మెల్యే తాతయ్యను ఆయన నివాసంలో కలిసి బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానించారు. ఆలయ సిబ్బంది దేవరశెట్టి నాగార్జున తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ప్రభుత్వ విప్‌, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాంలను కూడా కలిసి ఆహ్వానపత్రికలు అందజేసి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు.

అమ్రితసాయిలో క్యాంపస్‌ ఇంటర్వ్యూలు



ఎంపికయిన విద్యార్థులతో ప్రిన్సిపాల్‌ శశిధర్‌, ప్లేస్‌మెంట్‌ అధికారి డాక్టర్‌ చిరంజీవి

కంచికచర్ల: మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్‌ కళాశాలలో పాలిటెక్నిక్‌ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ ఎం.శశిధర్‌ శనివారం పేర్కొన్నారు. కళాశాలలో విద్యార్థులకు చైన్నైకు చెందిన టీవీఎస్‌ బ్రేక్స్‌ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌ కంపెనీ హెచ్‌ఆర్‌ ప్రతినిధులు రాత పరీక్ష, గ్రూప్‌ డిస్కషన్‌, టెక్నికల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారని చెప్పారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన 18 మంది విద్యార్థులను కంపెనీ తరుపున ఆపరేటర్‌ ట్రైనీగా ఎంపిక చేశారన్నారు. ఎంపికయిన వారికి రూ. 2,45 లక్షల వార్షిక వేతనంతో ఎంపిక చేపి వారికి నియామక పత్రం ఉత్తర్వులు అందజేశారు. ఎంపికయిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్‌ కె.రామ్మోహనరావు, పాలిటెక్నిక్‌ ఇన్‌చార్జి ఎస్‌.భానుమూర్తి, అన్ని విభాగాల అధిపతులు అభినందించారు.

క్రికెట్‌ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



వత్సవాయి :మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న క్రికెట్‌ పోటీలను శనివారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్‌ ప్రారంభించారు. ఫ్రెండ్స్‌ యూత్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఎన్టీఆర్‌ జిల్లాతో పాటు కృష్ణా, తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట జిల్లాల స్థాయిలో జరుగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభం అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల వల్ల మానసికోల్లాసం కలుగుతుందన్నారు. క్రీడలను వృత్తిగా ఎంచుకుని ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, పెద్ది రామారావు, నెల్లూరి శ్రీను, చిట్టూరి రమేష్‌, ఏసుపోగు రవి, దారెల్లి చిరంజీవి, పీడీ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలకొల్లులో కుసుమ ధర్మన్న జయంతి సభ

కంచికచర్ల: జాతీయోద్యమకారులు, తొలి దళిత కవి, వక్త, జయబేరి పత్రిక సంపాదకులు వైద్య విద్వాన్‌ కుసుమ ధర్మన్న జయంతి సభ పాలకొల్లులోని డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ భవన్‌లో ఆదివారం నిర్వహిస్తున్నామని బహుజనుల రచయితల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో వివిధ రంగాల్లో కృషి చేసిన వారికి కుసుమ ధర్మన్న జాతీయ స్థాయి పురస్కారాలతో పాటు సభలో కవి సమ్మేళనం, జముక పుస్తకావిష్కరణ ఉంటుందని చెప్పారు. నాగార్జున విశ్వవిద్యాలయ ప్రొఫెసర్‌ చల్లపల్లి స్వరూపరాణి, అంబేడ్కరిస్ట్‌ చిలకోటి కుర్మయ్య, సివిల్‌ సప్లయ్‌ డిపార్ట్‌మెంట్‌ డైరెక్టర్‌ మోకా ఆనందసాగర్‌, కాలజ్ఞానం సంపాదకులు మురళీమోహన్‌, కవి గూటం స్వామి, సత్యనారాయణ పాల్గొంటారన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

వన్‌టౌన్‌(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకూ నిర్వహించినున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పచ్చని పల్లెల్లో ఏరులై పారుతున్న మద్యం

- పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు ఏర్పాటు
- అర్ధరాత్రుళ్లు సైతం యథేచ్ఛగా విక్రయాలు
- పట్టించుకోని అధికారులు



వెల్లంకి మద్యం దుకాణం వద్ద ఏర్పాటు చేసిన షెడ్డులో మందు తాగుతున్న దృశ్యం



జుజ్జూరులో బార్‌ను తలపిస్తున్న బెల్టుషాపు

వీరులపాడు: బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా ఏర్పాటు చేయటంతో పచ్చని పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది. ఒక్కో గ్రామానికి రెండు, మూడు బెల్టుషాపులుండగా మేజర్‌ గ్రామాల్లో నాలుగైదు ఏర్పాటు చేశారు. బెల్టుషాపుల పుణ్యమాని గ్రామీణ ప్రాంతాల్లో అర్ధరాత్రుళ్ల సైతం మద్యం అందుబాటులోకి వచ్చిందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారుల ఉదాసీన వైఖరి వలనే లైసెన్స్‌ మద్యం దుకాణదారులు బెల్టు షాపులకు ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారనే ఆరోపణలు నెలకొన్నాయి. కూటమి ప్రభుత్వం మండలానికి మూడు మద్యం దుకాణాలను కేటాయించింది. దీంతో దుకాణాల నిర్వాహకులు ఒక దుకాణాన్ని వెల్లంకి గ్రామంలో ఏర్పాటు చేయగా మరొక రెండు దుకాణాలను అల్లూరు, జుజ్జూరు గ్రామ శివారుల్లో నెలకొల్పారు. ఈ మద్యం దుకాణాల నిర్వాహకులు బెల్టుషాపులకు ఇష్టారీతిని మద్యం సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా నెలకొన్నాయి. బెల్టుషాపుల నిర్వాహకులకు క్వార్టర్‌ బాటిల్‌పై రూ. 20 అదనంగా విక్రయించి లైసెన్స్‌ దుకాణదారులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. గ్రామాల్లో తాగేందుకు గుక్కెడు నీటికి అవస్థలు పడుతున్నా మద్యం మాత్రం ఎటువంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్‌ రూమ్‌లు..

మద్యం దుకాణ నిర్వాహకులు మందు బాబులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారని ప్రజలు బాహాటంగానే చెబుతున్నారు. ముఖ్యంగా మద్యం దుకాణాల వద్ద పర్మిట్‌ రూములు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేయలేదు. అయినప్పటికీ మద్యం దుకాణదారులు మందు తాగేందుకు ప్రత్యేకంగా షెడ్‌లు ఏర్పాటు చేసి సకల వసతులు కల్పిస్తున్నారు. మద్యం దుకాణాల్లో మంచి నీటి బాటిల్‌ రూ. 30 చొప్పున విక్రయిస్తున్నారని పలువురు చెబుతున్నారు.

తాగి తన్నుకుంటే.. అధికార పార్టీ నేతల రాజీ..

మండలంలోని వెల్లంకి గ్రామంలో ఏర్పాటు చేసిన బెల్టుదుకాణం వద్ద ఇటీవల కాలంలో మద్యం తాగి ఇద్దరు వ్యక్తులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలవటంతో బాధితుడు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామ అధికార పార్టీ నేతలు ఇద్దరితో మాట్లాడి రాజీ చేసినట్లు గ్రామ ప్రజలు బహిరంగంగానే చెబుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణదారులు బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించటంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్‌, తదితర శాఖల అధికారులు స్పందించి బెల్టుషాపులకు మద్యం సరఫరా చేయకుండా చూడటంతో పాటు గ్రామాల్లో వాటి నిర్మూలనకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ



పేట గ్రంథాలయంలో స్పోకెన్‌ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్‌

జగ్గయ్యపేట అర్బన్‌:పట్టణంలోని జిల్లా గ్రేడ్‌-1 స్థాయి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఉత్సాహంగా కొనసాగుతుంది. పలువురు ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులచే దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తక పఠనం చేయించారు. తరువాత గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన నాయకుల పేర్లు అడిగి వారితో విద్యార్థులతో చెప్పించారు. స్వాతంత్ర్య ఉద్యమకారులు భగత్‌సింగ్‌ తదితర నాయకుల గురించి తెలిపారు. అనంతరం ఇంగ్లీష్‌ ఉపాధ్యాయుడు వినోద్‌కుమార్‌ స్పోకెన్‌ ఇంగ్లీష్‌ తరగతి నిర్వహించారు. అలాగే ఉపాధ్యాయుడు ఎన్‌.దాసు మ్యాథమేటిక్స్‌, పజిల్స్‌, స్క్వేర్స్‌, క్యూబ్స్‌ గురించి చెప్పారు. మరో ఉపాధ్యాయుడు టి.ప్రసాద్‌బాబు విద్యార్థులతో ఎక్సర్‌సైజులు చేయించారు. గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్‌, రాము పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు

కొణకంచి(పెనుగంచిప్రోలు):స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు కొనసాగుతున్నాయి. శనివారం గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. అనంతరం విద్యార్థులు కథలు చదివి వినిపించటంతో పాటు డ్రాయింగ్‌ వేయటం, క్యారమ్స్‌ ఆడటం చేశారు.

వృద్ధురాలు అదృశ్యంపై కేసు నమోదు



కంచికచర్ల: మండల కేంద్రానికి చెందిన వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. దేవిరెడ్డి వెంకటసుబ్బమ్మ ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి వెళ్లి పోయింది. దీంతో ఆమె కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. రాజు తెలిపారు. ఇంటి నుంచి బయటకు వెళ్లే సమయంలో ఎరుపు రంగు చీరతో వెళ్లిందని ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌ నంబర్‌ 08678 274333 లేదా ఎస్‌ఐ 9440796460 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

లక్ష మల్లెల అర్చన



జగ్గయ్యపేట అర్బన్‌: రామానుజుల వారి జయంతి ఉత్సవాలు పట్టణంలో శనివారం స్థానిక శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్రామానుజ గోష్ఠి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో స్వామి వారికి లక్ష మల్లె పూల అర్చన కార్యక్రమం నిర్వహించారు.